నవోదయ ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కిల్తంపాలెం నవోదయ విద్యాలయంలో ఖాళీగా ఉన్న 9,11 తరగతుల సీట్లకు ఈనెల 8న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. ఈ మేరకు సర్వం సిద్ధం చేసినట్లు ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. 9వతరగతి ప్రవేశ పరీక్షకు ఎస్.కోటలో నాలుగు పరీక్ష కేంద్రాలు, 11వ తరగతి ప్రవేశ పరీక్షకు నవోదయ విద్యాలయంలో కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. 9వ తరగతి పరీక్షకు 1021 మంది, 11వ తరగతి పరీక్షకు 565 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఏవైనా సందేహాలుంటే 92474 69929, 80990 90562 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ఇంకా పొరుగు జిల్లాలకే

పరుగు

- 'మన్యం' జిల్లా ఏర్పడి మూడేళ్లు..
- పూర్తిస్థాయి వసతులకు నోచుకోని వైనం
- పేరుకే జిల్లా కేంద్రం.. విద్యాభివృద్ధి శూన్యం
- గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం.. జిల్లావాసులకు శాపం
- పోటీ పరీక్షలు, నైపుణ్య శిక్షణలకు కేంద్రాలు లేక అవస్థలు
- ఉన్నత విద్యకు దూరం
- కూటమి ప్రభుత్వంపై ఆశలు



పార్వతీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాఠాలు వింటున్న విద్యార్థులు



పార్వతీపురం/ పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పాటై మూడేళ్లు గడుస్తున్నా.. నేటికీ పూర్తిస్థాయి వసతులకు నోచుకోవడం లేదు. జిల్లాకేంద్రం కూడా అన్ని రకాలుగా వెనుకబడి ఉంది. పేరుకే జిల్లాకేంద్రమైనా.. ఇక్కడ ఉన్నత విద్య కళాశాలలు.. నైపుణ్య శిక్షణ కేంద్రాలు లేకపోవడంతో గిరిజన, మైదాన ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పోటీ పరీక్షలకు సంబంధించి పార్వతీపురంలో కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. దీంతో ప్రతిసారీ జిల్లావాసులు వ్యయ ప్రయాసాలకు గురువ్వాల్సి వస్తోంది. నానా అవస్థలు పడి పొరుగు జిల్లాలైన విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం చేరుకోవాల్సి వస్తోంది. ఒక్కోసారి ముందురోజు రాత్రే ఆయా జిల్లాలకు చేరుకుని పరీక్ష కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. మరోవైపు ఉన్నత విద్య జిల్లావాసులకు అందని ద్రాక్షగా మారింది. జిల్లాలో డిగ్రీ తర్వాత ఉన్నత విద్య కళాశాలలు లేవు. దీంతో చాలామంది చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టగా.. అతికొద్దిమంది మాత్రమే పొరుగు జిల్లాలకు వెళ్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఎంతో హడావుడిగా జిల్లాను ఏర్పాటు చేసినప్పటికీ విద్యాభివృద్ధికి ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఈ క్రమంలో జిల్లావాసులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

ఇదీ పరిస్థితి..

- జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 14, కేజీబీవీలు 14, , ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలలు ఐదు, మోడల్ కళాశాలలు నాలుగు, ఏపీటీడబ్ల్యూఆర్ కళాశాల 9, హైస్కూల్ ప్లస్‌లు 2, ప్రైవేట్ కళాశాలలు 34 ఉన్నాయి. వాటిల్లో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17,849 మంది వరకూ ఉన్నారు. అదేవిధంగా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో సుమారు 4,500 మంది చదువుతున్నారు. అయితే జిల్లాకేంద్రంలో పీజీ, ఇంజనీరింగ్, వైద్య కళాశాలలు లేవు. ఎంఈడీ వంటివి కూడా చదువుకోలేని పరిస్థితి. దీంతో ఏటా ఎంతోమంది విద్యార్థులు ఇంటర్, డిగ్రీ నుంచి రిలీవ్ అవుతున్నా.. ఉన్నత విద్యను మాత్రం అభ్యసించలేకపోతున్నారు.
- వాస్తవంగా ప్రతి జిల్లాలో కేంద్రియ విద్యాలయం ఉంటుంది. కానీ పార్వతీపురంలో మాత్రం ఆ విద్యాలయం లేదు. దీనిపై గత వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదు.
- పార్వతీపురంలో ప్రభుత్వ ఐటీఐ లేదు. దీంతో ఇక్కడ విద్యార్థులు పట్టణానికి సమీపంలో ఉన్న విజయనగరం జిల్లా బొబ్బిలి వెళ్లాల్సి వస్తోంది. సాలూరులో ఐటీఐ కేంద్రం ఉన్నా.. అక్కడ సరైన వసతులు లేవు. జిల్లాలో కొన్ని ప్రైవేట్ ఐటీఐలు ఉన్నా.. ఫీజులు ఎక్కువగా వసూలు చేస్తుండడంతో చాలామంది విద్యార్థులు వృత్తిపరమైన కోర్సులకు దూరమవుతున్నారు.
- జిల్లాలో ప్రభుత్వ నర్సింగ్ స్కూల్ కూడా లేదు. వివిధ సాంకేతిక కోర్సులకు సంబంధించి శిక్షణ కేంద్రాలు కూడా లేవు.
- పార్వతీపురం, జియ్యమ్మవలస మండలాల్లో పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నా.. పూర్తిస్థాయిలో సౌకర్యాలు లేవు. దీంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. కొందరు టీసీలు తీసుకుని వెనుదిరుగుతున్నారు.

(మిగతా 8వ పేజీలో...)



పోటీ పరీక్షల కోసం పార్వతీపురం మున్సిపల్ గ్రంథాలయంలో చదువుతున్న నిరుద్యోగులు

కేంద్రాలు ఏర్పాటు చేయాలి..



పోటీ పరీక్షలతో పాటు వివిధ కోర్సులకు సంబంధించి జిల్లా కేంద్రంలో శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తే.. నిరుద్యోగులు, విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. పార్వతీపురంలో వృత్తి నైపుణ్య కేంద్రాలు లేకపోవడం వల్ల ఎంతోమంది లక్ష్యాలను చేరుకోలేకపోతున్నారు.

- సీహెచ్ రమ్య, నిరుద్యోగి, పార్వతీపురం

కలగా ఉన్నత విద్య



డిగ్రీ అనంతరం ఉన్నత విద్యనభ్యసించాలంటే మా లాంటి వారికి కలగా మిగిలిపోతుంది. జిల్లా కేంద్రంలో ఉన్నత విద్యకు సంబంధించిన కళాశాలలు లేవు. దీంతో నా లాంటి ఎంతో మంది విద్యార్థులు ఆశలు వదులుకుంటున్నారు.

-ఎం.గాయత్రి, బీఎస్సీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని, పార్వతీపురం

వసతులు కరువు..

సమస్యలకు నెలవు

- ఇదీ కురుపాం జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయం పరిస్థితి..

జియ్యమ్మవలస/కురుపాం, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయం పరిస్థితి దయనీయంగా మారింది. దీర్ఘకాలికంగా అనేక సమస్యలతో సతమతమవుతోంది. ప్రధానంగా విద్యాలయాన్ని మౌలిక వసతుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. వాస్తవంగా ఈ పాఠశాల 2019లో ఏర్పాటైంది. ప్రస్తుతం ఇక్కడ 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 200 మంది విద్యార్థులు చదువు తున్నారు. ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఎనిమిది మంది గెస్ట్ టీచర్లతో పూర్తిగా ఇంగ్లిషు మీడియంలో బోధన సాగుతోంది. కాగా గత ప్రభుత్వం ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోలేదు. దీంతో గెస్ట్ టీచర్లతోనే నెట్టుకొస్తున్నారు. కాగా గురుకుల విద్యాలయంలో తాగునీటి సదుపాయం లేదు. 12 మరుగుదొడ్లే ఉండడంతో 200 మంది విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు పురాతన అద్దె భవనం ఏ క్షణాన కూలుతుందో తెలియని పరిస్థితి. ఈ ప్రైవేట్ భవనానికి ప్రతినెలా అద్దె కింద రూ. 74 వేలు చెల్లిస్తున్నారు. 2019 నుంచి ఇప్పటి వరకు అద్దె రూపంలో సుమారు రూ. 47.50 లక్షల వరకు చెల్లించారు. అయితే ఇంత పెద్ద మొత్తంలో అద్దె చెల్లింపుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు. గురుకుల విద్యాయంలో సమస్యలన్నీ ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టామని.. త్వరలోనే వాటిని పరిష్కరిస్తారని ఆశతో ఉన్నామని ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణ తెలిపారు.



గురుకుల విద్యాలయం

మగవారికీ పొదుపు సంఘాలు

- డ్వాక్రా మాదిరి ఏర్పాటు
- పొదుపు, పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం
- ఉమ్మడి జిల్లాలో 158 ఏర్పాటు చేయాలని నిర్ణయం
- ఇంతవరకు 80 ఏర్పాటు

గజపతినగరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధిలో డ్వాక్రా సంఘాలు అగ్రభాగాన నిలుస్తుండడం.. ఆయా కుటుంబాలకు ఆర్థిక ఆసరా ఇస్తుండడంతో మగవారిలోనూ పొదుపును ప్రోత్సహిస్తూ పేదల ఉపాధికి బాసటగా ఉండాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సంఘాల ఏర్పాటుకు మార్గదర్శకాలు కూడా ఇచ్చింది. రంగంలోకి దిగిన అధికారులు ఇప్పటికే కొన్ని సంఘాలను ఏర్పాటు చేశారు. తద్వారా నిరుద్యోగులు కూడా తగ్గుతారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. రివాల్వింగ్ ఫండ్‌తో చిన్నచిన్న వ్యాపారాలు, ఉత్పత్తుల తయారీ యూనిట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధి ఉంటుందని భావిస్తోంది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఈ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయికి తీసుకువెళ్లి సంఘాల ఏర్పాటుకు లక్ష్యాలను నిర్ణయించింది. పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య, భవన నిర్మాణ కార్మికులు, తాపీమేస్త్రీలు, రోజువారీ కూలిపని చేసేవారు... ఇళ్లు, పరిశ్రమల్లో పనిచేసేవాళ్లతో సంఘాలుగా ఏర్పాటు చేసేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాకు సంబంధించి విజయగనరం కార్పొరేషన్, నెల్లిమర్ల, బొబ్బిలి, రాజాం మున్సిపాల్టీలకి సంబంధించి 116సంఘాలు లక్ష్యంకాగా 63 సంఘాలు ఏర్పాటయ్యాయి. మన్యం జిల్లాకు సంబంధించి సాలూరు, పాలకొండ, పార్వతీపురం పట్టణాల్లో 42 సంఘాలు ఏర్పాటు చేయాలని లక్ష్యం పెట్టుకోగా 17 సంఘాలు ఏర్పాటు చేశారు. డ్వాక్రా గ్రూపుల్లోని కుటుంబ సభ్యులను ఎంచుకొని తొలుత గ్రూపులుగా ఏర్పాటు చేస్తారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా పొదుపు చేసినట్లయితే ఆరునెలల తరువాత ప్రభుత్వం రుణాన్ని మంజూరు చేస్తుంది. ఆ డబ్బులతో చిన్నచిన్న వ్యాపారాలు ప్రారంభించే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని వారికి అధికారులు చెబుతూ సంఘాలు ఏర్పాటయ్యేలా చూస్తున్నారు. ప్రతినెలా పొదుపు చేసిన మొత్తానికి ప్రభుత్వం అందజేసే రివాల్వింగ్ ఫండ్‌తో మగవారు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చు. మార్చి నెలాఖరునాటికి లక్ష్యాలను పూర్తి చేసేలా మెప్మా యాక్షన్ ప్లాన్ రూపొందించింది. ఏప్రిల్ నుంచి సంఘాలను నడిపించే దిశగా చర్యలు చేపడుతోంది.

ఇవీ అర్హతలు

ఐదుగురు సభ్యులు కలిసి సంఘంగా ఏర్పాటు కావచ్చు. వారికి కనిష్ఠంగా 18 ఏళ్లనుంచి గరిష్ఠంగా 60 ఏళ్ల వయసు ఉండాలి. ఆధార్, తెల్లరేషన్ కార్డు తప్పనిసరి. గ్రూపుగా ఏర్పడిన తరువాత పొదుపుశాతాన్ని బట్టి ఆరునెలలయ్యాక లింకేజీ రుణాలు మంజూరు చేస్తారు. గ్రూపులుగా ఏర్పడాలని అనుకొనే వారు మెప్మా సిబ్బందిని గాని, సంబంధిత కార్యాలయాల్లో గాని సంప్రదించాలి. ప్రతినెలా పొదుపు కనీసం రూ.100నుంచి రూ.1000 చేయవచ్చు. వీరికి ప్రభుత్వం ఆరునెలల తరువాత రివాల్వింగ్ ఫండ్‌గా రూ.25వేల వరకు అందజేస్తుంది. పొదుపు సొమ్ముకు ఐదునుంచి పదిరెట్లు రానుంది.



పేదరిక నిర్మూలన దిశగా చర్యలు

పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన దిశగా చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకువచ్చింది. పురుషుల సంఘాలను ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడిజిల్లాలో 158 సంఘాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇంతవరకు 80సంఘాలు ఏర్పాటయ్యాయి. నెలాఖరులోగా లక్ష్యం పూర్తి చేస్తాం. సంఘాల బలోపేతానికి క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తాం.

- జీవీ చిట్టీరాజు, మెప్మా పీడీ, ఉమ్మడి జిల్లా

వన్యప్రాణికి

ఎంత కష్టం

- అంతరించిపోతున్న వైనం
- అడవుల నరికివేతే కారణం
- కానరాని సంరక్షణ చర్యలు
- పర్యావరణ ప్రేమికుల ఆందోళన

6లో

తోటపల్లిలో ప్రారంభమైన

కల్యాణోత్సవాలు

- మరోవైపు విగ్రహాల ప్రతిష్ఠ
- తరలివస్తున్న భక్తులు



6లో

బెలగాం రైల్వేగేటు వద్ద నిలిచిన గూడ్స్ 8లో

త్వరలో మూడో ట్రాక్ పనుల పూర్తి 6లో

ఇళ్లు కట్టకపోతే రద్దు

- కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వెల్లడి
- మిర్తివలసలో బహిరంగ మల విసర్జనపై అసహనం

బలిజిపేట, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): గృహాలు మంజూరైన లబ్ధిదారులు తక్షణమే నిర్మించుకోవాలని, లేకుంటే వాటిని రద్దు చేసి కొత్తవారికి కేటాయిస్తామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. బుధవారం బలిజిపేటలో ఆయన మాట్లాడుతూ.. బలిజిపేటలో లబ్ధిదారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. అప్పటికీ నిర్మాణాలు పూర్తి చేయడానికి ముందుకు రాకపోతే తమకు తెలియజేయాలని సూచించారు. అనంతరం మిర్తివలసలో ఉపాధి హామీ వేతనదారుల హాజరును పరిశీలించారు. ఫారం పాండ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని, వేతనదారులకు గరిష్ఠ వేతనం అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. చెరువు వద్ద జంగిల్ క్లియరెన్స్ చేయాలని, వర్షాలు కురిసినప్పుడు గండి పడకుండా చూడాలని సూచించారు. రీసర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారుల బరువు, ఎత్తును పరిశీలించారు. ప్రతిఒక్కరికీ టేక్ హోమ్ రేషన్ అందించాలని ఆదేశించారు. కాగా మిర్తివలసలో పారిశుధ్య లోపం, బహిరంగ మల విసర్జనపై అసహనం వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మరుగుదొడ్లు వినియోగించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, హౌసింగ్ ఇన్‌చార్జి అధికారి పి.ధర్మారెడ్డి తదితరులున్నారు.



బలిజిపేటలో గృహ సముదాయాలను పరిశీలిస్తున్న కలెక్టర్

మాతాశిశు మరణాలు సంభవించరాదు

పార్వతీపురం, ఫిబ్రవరి5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఒక్క మాతా శిశు మరణం కూడా సంభవించరాదని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ అన్నారు. గర్భిణులు ప్రసవమయ్యేవరకు సంబంధింత పీహెచ్‌సీ వైద్యాధికారి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. మాతా శిశు మరణాలపై బుధవారం కలెక్టరేట్‌లో పీహెచ్‌సీల వారీగా సమీక్షించారు. ప్రతి గర్భిణీకి ఒక రికార్డు నిర్వహించాలని, కుటుంబ చరిత్రను ముందే తెలుసుకుని జన్యుపరమైన వ్యాధులకు వైద్యం అందించా లని కలెక్టర్ సూచించారు. మాతా శిశు మరణాల నివారణకు గైనకాలజిస్ట్, పిడియాట్రిషి యన్లతో మెడికల్ ఆఫీసర్లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లకు శిక్షణ ఇప్పించాలని తెలిపారు. జిల్లాలో మలేరియా కేసులు నమోదు కాకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో భాస్కరరావు, డీసీహెచ్ఎస్ బి.వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

'పల్లె పండుగ'

పనుల పరిశీలన

- నాణ్యత లోపించరాదని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోల ఆదేశం

పాలకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పాలకొండ, వీరఘట్టం మండలాల్లో 'పల్లె పండుగ' కింద చేపడుతున్న అభివృద్ధి పనులను బుధవారం సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యత లోపించరాదని ఆదేశించారు. పాలకొండ మండలంలో టీకేఆర్‌పురం, చింతాడ, అర్ధలి గ్రామాల్లో సీసీ రోడ్డు, కాలువల పనులను పరిశీలించారు. ఈ నెలాఖరుకు అన్ని పనులు పూర్తి చేయాలన్నారు. అనంతరం వీరఘట్టం మండలంలోని ఎం.రాజపురం గ్రామంలో అభివృద్ధి పనులను పరిశీలించారు. ● కొమరాడ: మండలంలో దిగువ గుణద, నవర గుణద, బిన్నిడి వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డును పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ పరిశీలించారు. నాణ్యత లేని రహదారులకు బిల్లులు చెల్లించబోమని స్పష్టం చేశారు. డీడీలు, ఇంజనీరింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

ఉత్సాహంగా బాలోత్సవ్

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి)

విజయనగరంలోని ఆనంద గజపతి కళాక్షేత్రంలో బుధవారం బాలోత్సవ్ (బాలల పండుగ) కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం, స్పెల్ బీ, క్విజ్, జానపద, శాస్త్రీయ నృత్య పోటీలను నిర్వహించారు. సీనియర్, జూనియర్స్ విభాగంలో విజయం సాధించిన వారికి బహుమతులు అందజేశారు. జూనియర్స్ విభాగంలో కె.యోగిత (తాటిపూడి మోడల్ స్కూల్), జి. జ్యోతిక (గురజాడ పబ్లిక్ స్కూల్), కె.దివ్య (గురజాడ పబ్లిక్ స్కూల్), సీనియర్స్ విభాగంలో జి. మౌనిక (ప్రభాకర్ ఐఐటీ అకాడమీ), ఎం.గుణ శేఖర్ (పెదమానాపురం), ఎస్కే ఆసిమా అహ్మద్ (జి.జి. హైస్కూల్)లు విజయం సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జీఎస్ చలం తదితరులు పాల్గొన్నారు.





విద్యార్థినుల నృత్యాలు



జానపద నృత్య రూపకంలో..



మహిళల కోలాటం



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తోటపల్లిలో ప్రారంభమైన కల్యాణోత్సవాలు

- మరోవైపు విగ్రహాల ప్రతిష్ఠ
- తరలివస్తున్న భక్తులు



విద్యుద్దీపాల అలంకరణలో నూతన దేవాలయాల సముదాయం



వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవేంకటేశ్వర, కోదండ రామస్వామి దేవస్థానాల్లో బుధవారం వార్షిక కల్యాణ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉభయ దేవస్థానాల్లో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మొదటి రోజు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రాయశ్చిత్తం, రుత్విక్ వరుణ, దీక్షా వస్త్ర కంకణ ధారణ, ప్రత్యేక పూజలను కేవీ నరసింహాచార్యులు, జంధ్యాల జగన్నాథశాస్త్రిల పర్యవేక్షణలో నిర్వహించారు. నూతన ధ్వజ, యంత్ర, శిఖర, గరుడ పరివార దేవతా సహితంగా పునః ప్రతిష్ఠ కార్యక్రమాలను ఈ నెల 7న నిర్వహించనున్నారు. యంత్ర ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవానికి పుష్పగిరి పీఠాధిపతులు విద్యా శంకరభారతి స్వామి హాజరు కానున్నారు. ఉత్సవాల సందర్భంగా దేవస్థానం కొత్త కళను సంతరించుకుంది. ఆలయ పరిసరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవస్థానం ఈవో వీవీ సూర్య నారాయణ, సిబ్బంది గంట శ్రీధర్‌నాయుడుతో పాటు ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధులు డాక్టర్ డి.పారినాయుడు, కిమిడి శ్రీరామ్మూర్తి, డి.ధనుంజయరావు, ఎం.పకీరునాయుడు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాల నేపథ్యంలో తోటపల్లి ప్రాంతం నమో వేంకటేశాయ నామస్మరణతో మార్మోగుతోంది.



కలశ పూజలో మహిళలు



విగ్రహాలను సిద్ధం చేస్తున్న దృశ్యం

గరుడ వాహనంపై వేణుగోపాలుడు

- ఘనంగా బ్రహ్మోత్సవాలు



బొబ్బిలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి వేణుగోపాల స్వామి వారి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం స్వామి వారిని గరుడ వాహనంపై పట్టణ వీధులలో ఊరేగించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త ఆర్‌వీఎస్‌కే రంగారావు ఆధ్వర్యంలో ఈ నెల 8న సీతారాములు, రాధాకృష్ణుల కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వాహక అధికారి ప్రసాద్ తెలిపారు. 12న స్వామి వారికి పుష్పయాగం, ద్వాదశ కాలార్చన, పూర్ణాహుతి, పవళింపు సేవలను నిర్వహించనున్నట్టు వెల్లడించారు.



మద్దువలసలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

గుర్రపు డెక్కతో చిక్కులు

వంగర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మద్దువలస రిజర్వాయర్‌లో గుర్రపు డెక్క భారీగా పెరిగిపోయింది. రిజర్వాయర్‌లో నీరు కనిపించకుండా... మైదానాన్ని తలపించేలా వ్యాపించింది. దీంతో మత్స్యకారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన గేట్లు... కాలువ గేట్ల వద్ద ఇది పేరుకుపోవడంతో తరచూ గేట్లు మరమ్మతులకు గురవుతున్నట్టు మత్స్యకారులు తెలిపారు. దీని వల్ల వేటకు కూడా కష్టమవుతోందని చెప్పారు. తమ సమస్యను అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం ఉండడం లేదని మత్స్యకారులు వాపోతున్నారు. గుర్రపు డెక్కను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వన్యప్రాణికి ఎంత కష్టం

- అంతరించిపోతున్న వైనం
- అడవుల నరికివేతే కారణం
- కానరాని సంరక్షణ చర్యలు
- పర్యావరణ ప్రేమికుల ఆందోళన







గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి)

పార్వతీపురం మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతంపేట అటవీ ప్రాంతంలో వన్య ప్రాణులు అంతరించిపోతున్నాయి. అడవుల నరికివేతే దీనికి కారణమని ప్రకృతి ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధిలో భాగంగా గిరిజన ఆవాసాలకు గత 15 ఏళ్లగా రహదారి సౌకర్యం కల్పిస్తున్నారు. ఇవి అడవి దొంగలకు రాజమార్గాలుగా మారాయి. విలువైన చెట్లను అక్రమంగా నరికి... ఈ రహదారులపై నుంచే రాత్రిపూట తరలిస్తున్నారు. ఈ కారణంగానే వందలాది ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ అంతరించిపోయింది. అడవి అంతరించిపోవడంతో ఇక్కడ నివాసయోగ్యం లేక కొండ మేకలు, దుప్పులు, అడవి పందులు, కణుజులు, లేళ్లు, చిరుత పులులు తదితర వన్య ప్రాణులు కనుమరుగైపోయాయి. అనేక చోట్ల అడవులు మైదానాల్లా కనిపిస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. కొత్తగా మొక్కలు నాటేందుకు అటవీ శాఖ అధికారుల నుంచి పూర్తి స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నట్టు కనిపించడం లేదు. ఒకప్పుడు ఈ ప్రాంతంలో నెమళ్లు ఎక్కువగా సంచరించేవి. చెట్లు తగ్గడంతో నెమళ్ల సంతతి కూడా గణనీయంగా పడిపోయింది. అరుదుగా మాత్రమే ఇవి కనిపిస్తున్నాయి. కౌజుపిట్టలు, అడవి పావురాలు తదితర వందలాది పక్షి జాతులు కూడా కనిపించడం లేదు. 20 ఏళ్ల కిందటి పోలిస్తే అటవీ ప్రాంతం బాగా తగ్గిపోయిందని... దీంతో వర్షాలు సరిగా కురవక... నీటి జాడలు కూడా తగ్గిపోయాయని ఈ ప్రాంతంలో నివసించే పెద్దలు, వృద్ధులు చెబుతున్నారు. ప్రభుత్వాలు దృష్టిపెట్టి అటవీ ప్రాంతాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉంది.

ప్రచారం చేస్తున్నాం..

వన్య ప్రాణుల పరిరక్షణకు గిరిజన గ్రామాల్లో ప్రచారం చేస్తున్నాం. అటవీ పరిరక్షణలో భాగంగా నల్లమద్ది, ఎగిశా, రోజ్‌వుడ్, తదితర మొక్కలను నాటిస్తున్నాం.

-లక్ష్మణరావు, కురుపాం రేంజ్ ఆఫీసర్

సంరక్షణ చర్యలు చేపట్టాలి..

అడవుల సంరక్షణకు చర్యలు చేపట్టాలి. అప్పుడే వన్య ప్రాణుల మనుగడ సాధ్యమవుతుంది. ఆ దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలి.

-జగ్గారావు, సర్పంచ్, తాడికొండ

త్వరలో మూడో ట్రాక్ పనుల పూర్తి

- డీఆర్ఎం మనోజ్ కుమార్ సాహు
- బొబ్బిలి రైల్వే స్టేషన్ పరిశీలన

బొబ్బిలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విశాఖ-రాయపూర్ లైనులో మూడో ట్రాక్ నిర్మాణ పనులు మరో నాలుగైదు నెలల్లో పూర్తవుతాయని రైల్వే డివిజనల్ మేనేజర్ మనోజ్ కుమార్ సాహు వెల్లడించారు. బొబ్బిలి రైల్వేస్టేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. తొలుత సిగ్నలింగ్ వ్యవస్థను, రికార్డులను పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం విశాఖ-రాయపూర్‌లో జరుగుతున్న మూడో లైన్ పనులను, నూతనంగా నిర్మిస్తున్న స్టేషన్ భవనాలు తదితర వాటిని పరిశీలించారు. ప్లాట్‌ఫామ్‌ను, దివ్యాంగుల టాయ్‌లెట్లను పరిశీలించి... వాటి లోపాలు సరిదిద్దేందుకు అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. విశాఖ-రాయపూర్ లైనులో మూడో ట్రాక్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. మరో నాలుగైదు నెలల్లో పనులు పూర్తవుతాయని చెప్పారు. నూతనంగా సాలూరు నుంచి బొబ్బిలి మీదుగా విశాఖకు రైలు నడిపే ప్రతిపాదన విషయాన్ని ప్రస్తావించగా... ఇందుకు సంబంధించి ప్రాథమిక సర్వే పూర్తయిందన్నారు. ఈ లైనులో సాంకేతిక పరంగా తీర్చాల్సిన 30 సమస్యలను గుర్తించారని ఆయన చెప్పారు. వాటిని పరిష్కరించిన వెంటనే రైలును నడిపేందుకు కృషి చేస్తామని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించి తన పరిధిలో ఎటువంటి వివరాలనూ వెల్లడించలేనని స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో మార్చి తరువాత కొత్త ప్రాజెక్టులు వస్తాయని డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు వివరించారు. ఆయన వెంట సీనియర్ డీసీఎం సందీప్, జేఎం అవినాష్ తదితరులు ఉన్నారు.



అధికారులతో చర్చిస్తున్న డీఆర్ఎం మనోజ్ కుమార్ సాహు

రైస్ మిల్లులను తనిఖీ చేయండి

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) స్థానిక కేఎల్ పురంలో రామలక్ష్మణ ట్రేడర్స్ రైస్ మిల్లును జేసీ కలెక్టరు సేతు మాధవన్ బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లులోని ధాన్యం నిల్వలను రికార్డులను పరిశీలించారు. విద్యుత్ మీటర్, విద్యుత్ బిల్లును తనిఖీ చేశారు. మిల్లింగ్‌పై ఆరా తీశారు. అనంతరం సమీపంలో ఎఫ్‌సీఐ గోదాములను ఆయన పరిశీలించారు.

16న ఆన్‌లైన్ సంగీతం పోటీలు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈనెల 16న ఆన్‌లైన్‌లో సంగీతం పోటీలు నిర్వహించనున్నట్టు ధవళ సర్వేశ్వరరావు, మండపాక రవి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 6 నుంచి 11 ఏళ్ల సబ్ జూనియర్స్ విభాగం, 12 నుంచి 17 ఏళ్ల జూనియర్స్, 18 నుంచి 30 ఏళ్ల సీనియర్స్ విభాగంలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 15లోపు ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9440114618ని సంప్రదించాలని కోరారు.

ఏకగ్రీవంగా కార్యదర్శుల సంఘం ఎన్నిక

మెంటాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక బుధవారం ఏకగ్రీవంగా జరిగింది. పంచాయతీ విస్తరణ అధికారి పి.విమలకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడిగా లోకారపు ముత్యాలు, ఉపాధ్యక్షురాలిగా కె.గౌరి, ప్రధాన కార్యదర్శిగా జి.కృష్ణ, కోశాధికారిగా ఎ.రవి, సంయుక్త కార్యదర్శిగా కె.గణేష్ ఎన్నికయ్యారు.

మద్యం దుకాణాల దరఖాస్తుల గడువు పెంపు

గజపతినగరం, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత సామాజిక వర్గానికి ప్రభుత్వం కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 5 వరకు ఉన్న గడువును 8 వరకు పొడిగించినట్టు ఎక్సైజ్ సీఐ జనార్దనరావు ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10న ఉదయం 9 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో మద్యం దుకాణాలకు డ్రా నిర్వహిస్తామన్నారు.

● నెల్లిమర్ల: కల్లు గీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాల దరఖాస్తు గడువును ఈ నెల 8 వరకు ప్రభుత్వం పొడిగించిందని ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● కొత్తవలస: యాత సామాజిక వర్గానికి కొత్తవలసలో కేటాంచిన మద్యం దుకాణానికి సంబంధించిన గడువును మరో మూడు రోజులు పొడిగించినట్టు ఎక్సైజ్ సీఐ జీఎస్ రాజశేఖరనాయుడు తెలిపారు. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

● రాజాం: కల్లుగీత కులస్థులకు కేటాయించిన మద్యం దుకాణాలకు దరఖాస్తులకు గడువును పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాజాం ఎక్సైజ్ సీఐఆర్ జైభీమ్ ఒక ప్రకటనలో తెలిపారు.

పన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్

రేగిడి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వాహనాల పన్ను వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్టు పాలకొండ డివిజన్ ఎంవీఐ కుమార్ తెలిపారు. ఉమ్మడి జిల్లా సరిహద్దు ప్రాంతం మండలంలో సంకిలిలో బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. వాహనాలను నిలిపి పన్ను చెల్లింపులపై ఆరా తీశారు.

డ్రగ్స్ నిరోధంపై అవగాహన

చీపురుపల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల నిరోధంపై సీఐ జి.శంకరరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలల్లో మానవీయత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎల్. దామోదరరావు, కె.నాగరాజు, బీవీ గోవిందరాజులు, ప్రిన్సిపాల్స్ మద్దిలి వినోద్‌బాబు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీ తూర్పు మండల అధ్యక్షుడిగా జమ్ము రాంబాబు



రాంబాబుతో జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌వర్మ

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని తూర్పు మండలం బీజేపీ అధ్యక్షుడిగా జమ్ము రాంబాబును నియమిస్తూ జిల్లా పార్టీ అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేశ్‌వర్మ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర పార్టీ సూచన మేరకు ఈ నియామకాన్ని పూర్తి చేశారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ లక్ష్మీనరసింహం, కొండేల శ్రీనివాసరావు, బూర జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో ఫ్యామిలీ కౌన్సిలింగ్ డే

శృంగవరపుకోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రాతా వారోత్సవాల సందర్భంగా బుధవారం శృంగవరపుకోట ఆర్టీసీ డిపోలో డ్రైవర్స్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ డేను నిర్వహించారు. రహదారి భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డిపో మేనేజర్ కె.రమేశ్ వివరించారు. మహిళలకు పండ్లు, వస్త్రాలు అందజేశారు.

గురుకుల పాఠశాల తనిఖీ

వేపాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బక్కునాయుడుపేటలోని అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను బుధవారం గురుకులాల జిల్లా కో-ఆర్డినేటర్ రూపావతి తనిఖీ చేశారు.. అనంతరం పాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతూ పరీక్షలు బాగా రాయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యు.ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

తహసీల్దార్ విచారణ

మెంటాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆండ్ర ఎస్ఐ సీతారాంపై వచ్చిన అభియోగంపై తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు బుధవారం విచారణ నిర్వహించారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, పిట్టాడ సర్పంచ్ పైడిపునాయుడులను తన కార్యాలయంలో విచారించి వారి నుంచి వాంగ్మూలం తీసుకున్నారు.

అలాగే రిఫర్ చేసేస్తారా?

● గర్భిణిని ఆస్పత్రిలో చేర్చుకోకపోవడంపై డీఎంహెచ్‌వో సీరియస్

● ముగ్గురు గైనకాలజిస్టులు ఏమయ్యారని అసహనం ● విచారణకు ఆదేశం



వైద్యులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

మెంటాడ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆస్పత్రిలో చేర్చుకోని ఘటనపై డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి సీరియస్ అయ్యారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'నాలుగు దాటాక వైద్యులు ఉండరంట' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. గజపతినగరంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. నిండు గర్భిణి విషయంలో అక్కడి సిబ్బంది వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెంటాడ మండలానికి చెందిన గర్భిణి పాడి గౌరమ్మ పురిటినొప్పులతో 108 వాహనంలో మంగళవారం సాయంత్రం ఆస్పత్రికి తీసుకువచ్చినా సిబ్బంది పట్టించుకోని తీరుపై మండిపడ్డారు. గర్భిణిని తీసుకువచ్చిన సమయం లో అందుబాటులో ఉన్న వైద్యులెవరు? మిగిలిన వారు లేకపోవడానికి కారణాలేంటి అని ప్రశ్నించారు. గర్భిణిని విజయనగరం రిఫర్ చేయాల్సిన అవసరం ఏమి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్గమధ్యంలో ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత తీసుకుంటారని నిలదీసినట్టు తెలిసింది. హైరిస్క్ కేసుగా గుర్తించి రిఫర్ చేయాల్సి వచ్చిందని సిబ్బంది చెప్పారని సూపరింటెండెంట్ జగదీశ్.. డీఎంహెచ్‌వోకు బదులిచ్చారు. ముగ్గురు గైనకాలజిస్టులు ఆస్పత్రిలో ఉన్నప్పటికీ ఆ సమయంలో ఒక్కరూ అందుబాటులో లేకపోవడానికి కారణమేంటని ఆరా తీశారు. కనీసం కాల్ డ్యూటీకు అందుబాటులో లేకపోవడంపై విచారణ వ్యక్తం చేశారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని సూపరింటెండెంట్‌ను డీఎంహెచ్‌వో ఆదేశించారు. నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.

వక్ఫ్ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోండి

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వక్ఫ్ స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి వక్ఫ్ పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టరు మాట్లాడుతూ వక్ఫ్ స్థలాలు అన్యాక్రాంతం అవ్వకుండా చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉందన్నారు. జిల్లాలో మొత్తం 99 వక్ఫ్ స్థలాలు గుర్తించడం జరిగిందని, వీటిల్లో 32 స్థలాలను ఇప్పటికే నోటిఫై చేయడం జరిగిందని చెప్పారు. రెండు రోజుల్లో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్‌లకు వివరాలు అందజేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఏఎస్పీ సౌమ్యలత, డీపీవో వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు

బాల కార్మికులను గుర్తించండి

విజయనగరం కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల కార్మికులకు గుర్తించి వారంలోగా ఖచ్చితమైన సంఖ్యను తెలియజేయాలని కలెక్టర్ అంబేడ్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన బాల కార్మికులకు పునరావాసం కల్పించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. పని చేయించుకున్న సంస్థలపై జరిమానాలతో పాటు కేసులు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

కళా కుటుంబానికి పరామర్శ





కళాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు అదితి, బేబీనాయన

రేగిడి/ రాజాం ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు సోదరుడు, పారిశ్రామికవేత్త కిమిడి సత్యనారాయణ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను బుధవారం బొబ్బిలి, విజయనగరం ఎమ్మెల్యేలు బేబీనాయన, అదితి గజపతిరాజు పరామర్శించారు. సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి కళా నివాసానికి వెళ్లి ఆయన్ని పరామర్శించారు.

కోండ్రును కలిసిన బేబీనాయన

రాజాం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌ను బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన మర్యాదపూర్వకంగా కలిశారు. కాసేపు నియోజకవర్గాల పరిస్థితులపై చర్చించుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మెరుగైన పాలన అందిస్తోందని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబునాయుడు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారని కోండ్రు అన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై మంచి ఫీడ్ బ్యాక్ వస్తోందన్నారు. సాంకేతిక వినియోగంలో ఇదో విప్లవాత్మక మార్పు అనే చెప్పాలని కోండ్రు అభిప్రాయపడ్డారు.

సూర్యనారాయణకు కోండ్రు నివాళి



నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే కోండ్రు

సంతకవిటి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో మామిడిపల్లి లో తూర్పుకాపు మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు కొల్ల అప్పలనాయుడు తండ్రి కొల్ల సూర్యనారాయణ (94) మృతి చెందిన నేపథ్యంలో ఆయన భౌతికకాయాన్ని బుధవారం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ సందర్శించి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో కోండ్రు జగదీష్, వల్లూరు గణేష్, గట్టి భాను, సమతం శ్రీను, చెలికాని మహేష్‌బాబు, గురవాన నారాయణరావు, దూబ ధర్మారావు, దుప్పలపూడి శ్రీను తదితరులున్నారు.

దివ్యాంగ కళాకారులకు సినీ అవార్డులు



భుజంగరావు



స్వప్నిక



చంద్రరావు

రాజాం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ముగ్గురు దివ్యాంగ కళాకారులకు ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ అవార్డులు దక్కాయి. ఇటీవల విశాఖలో దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖరత్న కళాపరిషత్ సంయుక్తంగా నిర్వహించిన ఎన్టీఆర్ సినీ వజ్రోత్స కార్యక్రమంలో రాజాం మండలం పెనుబాక గ్రామానికి చెందిన లారెన్స్ దివ్యాంగుల మల్టీ టాలెంట్ షో ఆర్గనైజర్, సింగర్, డాన్సర్, మిమిక్రీ ఆర్టిస్ట్ బంగారు భుజంగరావు, రేగిడి మండలం నాయరాలవలస గ్రామానికి చెందిన మౌత్ ఆర్టిస్ట్ కొవ్వాడ స్వప్నిక, సంతకవిటి మండలం గోవిందపురం గ్రామానికి చెందిన సింగిల్ లెగ్ డాన్సర్ చంద్రరావు సినీ అవార్డులు అందుకున్నారు.

ఉత్సాహంగా ఎడ్ల బండ్ల పోటీలు

కొత్తవలస, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వియ్యంపేట గ్రామ దేవత సూకాలమ్మ తీర్థం సందర్భంగా బుధవారం ఎడ్ల బండ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తిలకించేందుకు పెద్దఎత్తున ప్రజలు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, సర్పంచ్ పులిబండి జ్యోతి, ఉప సర్పంచ్ పులిబండి రాము పాల్గొన్నారు.

● వేపాడ: మండలంలోని జాకేరులో నిర్వహిస్తున్న చిన్నమ్మలు, పైడితల్లమ్మ పేరంటాళ్ల తీర్థ మహోత్సవంలో రెండోరోజు బుధవారం గుర్రాల పరుగు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన సంగిడి రాళ్ల పోటీలో 10 మంది పాల్గొన్నారు. ప్రజలు ఆసక్తిగా చూశారు.

జాతీయ రహదారిని పరిశీలించిన ఎస్పీ



ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల పరిశీలనలో ఎస్పీ

పూసపాటిరేగ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయరహదారిపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం పరిశీలించారు. స్వయంగా జాతీయ రహదారిపై ప్రమాద ప్రాంతాలను అన్నింటిని పరిశీలించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులకు సూచనలు ఇచ్చారు. ప్రమాదాల నియంత్రణకు సెంట్రల్ డివైడర్స్, లైటింగ్, జిగ్‌జాగ్, సర్వీసు రోడ్లపై స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండలంలో కొప్పెర్ల, కోనాడ జంక్షన్, పేరాపురం, పూసపాటిరేగ, సీహెచ్ అగ్రహారం, కనిమెళ్ల వద్ద ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. తదనంతరం పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ ఎం.శ్రీనివాశరావు, భోగాపురం రూరల్ సీఐ రామకృష్ణ, ఎన్‌హెచ్ఏ మేనేజర్ రామస్వామి తదితరులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ముహూర్తపు రాట



రాటను వేస్తున్న గ్రామ పెద్దలు, భక్తులు

రాజాం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజాంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరకు మూర్తపు రాట కార్యక్రమాన్ని బుధవారం కమిటీ పెద్దలు, స్థానికులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకుడు వేమకోటి సూర్యనారాయణశర్మ మంత్రోచ్చరణల నడుమ ఉదయం 9 గంటలకు మూర్తపు రాట వేశారు. అనంతరం అమ్మవారి జాతరకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను దేవాదాయ శాఖ ఈవో మాధవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వాకిచర్ల దుర్గాప్రసాద్ రాజా, పైడిరాజు, తాతీయలు, సలాది వెంకటరమణ. సలాది తులసీదాస్. గ్రంధి గోపి. పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు

సూర్యఘర్‌పై అవగాహన కల్పించండి

రాజాం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాని సూర్యఘర్ పథకం మహిళా సంఘాల పేరుతో మంజూరు చేయడం జరుగుతుందని ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఏపీఎంలు, సీసీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూర్యఘర్‌పై మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి ఏపీఎంలు భవాని, గోవింద్, మంగమ్మ, దదికుమార్ తదితరులు పాల్గొన్నారు.

● చీపురుపల్లి: ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పించాలని వెలుగు ఏరియా సమన్వయకర్త బంగారమ్మ సూచించారు. బుధవారం చీపురుపల్లిలో జరిగిన వీఓఏల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ పథకానికి గ్రామాల్లో ప్రచారం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం ఎన్. అప్పలనాయుడు, శిక్షకులు రాజేష్‌వర్మ, వెంకటేశ్ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లపై ప్రతిఘటిద్దాం

నెల్లిమర్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమల్లోనికి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ప్రతిఘటించేందుకు కార్మికవర్గం చైతన్యవంతమైన పోరాటాలకు సిద్ధం కావాలని ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి స్థానిక ఇఫ్టూ కార్యాలయంలో నెల్లిమర్ల అమరవీరుల 31వ వర్ధంతి సభ నిర్వహించారు. ఇఫ్టూ నాయకుడు నామాల తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ సభకు వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభకు ముందు ఇఫ్టూ పతాకాన్ని సంఘం జిల్లా నా యకుడు కాళ్ల అప్పలసూరి ఆవిష్కరించారు. అమరవీరుల చిత్ర పటాల వద్ద నివాళి అర్పించారు. అరుణోదయ కళాకారులు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో భారత నాస్తిక సమాజం నాయకులు జీడి సారయ్య, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు రొంగలి అప్పలరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గీత, డి.ఏడుకొండలు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

● కొత్తవలస: కార్మికులకు నష్టం కలిగించే కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని కొత్తవలసలోని అంబేడ్కర్ కూడలిలో బుధవారం వ్యసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో గాడి అప్పారావు, గొంప కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● విజయనగరం దాసన్నపేట: కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ డిమాండ్ చేశారు. నగర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిదులు రమణ, రవి, రాములు, భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

● రాజాం రూరల్: లేబర్ కోడ్‌లను వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో రాజాంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో త్రినాథ్‌నాయుడు, శ్రీనివాసరావు తదితరులున్నారు.

ఘనంగా బల్లల పండుగ

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నగర శివార్లలోని ఊటగెడ్డ చాకిరేవులో బుధవారం బల్లల పండుగను రజకులు ఘనంగా నిర్వహించారు. ఏటా సంప్రదాయంగా సంక్రాంతి తరువాత వృత్తిని ప్రారంభించడానికి ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. రజక సంఘాల ప్రతినిధి ముత్యాల పైడిరాజు అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. బోయవీధి, నల్లావీధి, హుకుంపేట, చిక్కాలవీధి, వైఎస్సార్ నగర్ కాలనీకి చెందిన రజకులు పండుగలో పాల్గొన్నారు.ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్ది అప్పలరాజు, సంఘ ప్రతినిధులు జి.సత్యారావు, పెద్దన్న, అంజయ్య, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చురుగ్గా దొగ్గపేట-నర్సంపేట రోడ్డు పనులు

● పలు గ్రామాల ప్రజల్లో హర్షం



వెట్‌మిక్స్ వేసి రోలింగ్ చేస్తున్న దృశ్యం

వేపాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మపల్లి శివారు దొగ్గపేట-నర్సంపేట రోడ్డుకు మంచిరోజులు వచ్చాయి. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కృషితో రోడ్డు అభివృద్ధికి రూ.50 లక్షలు ఉపాధి నిధులు మంజూరయ్యాయి. ఈ పనులకు విశాఖ ఎంపీ శ్రీభరత్ శంకుస్థాపన చేశారు. రోడ్డు పనులు చురుగ్గా సాగుతుండటంతో దొగ్గపేట, కుమ్మపల్లి, పైలకొంపలు, నర్సంపేట తదితర గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్రైం న్యూస్

మహిళ ఆత్మహత్యాయత్నం

బాడంగి, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గజరాయనివలస గ్రామానికి చెందిన వర్రి పార్వతీ గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పొలానికి రాలేదని భర్త అప్పన్న కోపగించుకోవడంతో మనస్థాపం చెందిన పార్వతి బుధవారం గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనం ద్వారా స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు, తహసీల్దార్, మండల మేజిస్ట్రేట్ సుధాకర్.. పార్వతీ దగ్గర వాగ్మూలం తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

దత్తిరాజేరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ వి.బాలాజీరావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఆయన తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి డొంకినవలస రైల్వే స్టేషన్ సమీపంలోని కె.కృష్ణాపురంలో గుర్తు తెలియని రైలు సదరు వ్యక్తిని ఢీకొందన్నారు. మృతుడి వయసు 43 ఏళ్లు ఉండవచ్చుని, జీన్ ప్యాంటు, ఫుల్ హ్యాండ్స్ బనియన్ ధరించి ఉన్నాడని తెలిపారు. మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9490617089, 9491813163 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రెండు బైక్‌లు ఢీ: ముగ్గురికి గాయాలు

బొబ్బిలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐ సమీపంలో బుధవారం రాత్రి రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక ఐటీఐ కళాశాల వసతి గృహంలో ఉంటున్న రాగోలు అభి అనే విద్యార్థి బొబ్బిలి నుంచి రామభద్రపురం వైపు బైకుపై వెళుతున్నాడు. రోడ్డు క్రాస్ చేస్తుండగా మరో బైకును ఢీకొట్టాడు. దీంతో ఆ బైకుపై ఉన్న కొమరాడ మండలం గుమడ గ్రామానికి చెందిన సాజా, షెక్ లాల్‌బీలు కింద పడి గాయపడ్డారు. అలాగే అభికి కూడా గాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లాల్‌బీ పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ కేసు నమోదు చేశారు.

పోక్సో కేసు నమోదు

భోగాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):మండలంలోని తూడెం పంచాయతీకి చెందిన బాలిక(17)ను అదే గ్రామానికి చెందిన వ్యక్తి ఇబ్బంది పెడుతున్నాడని బాధితురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేశామని సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపారు. పోలీసులు అందించిన వివరాలు ప్రకారం... గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన వ్యక్తి కొంతకాలంగా ఇబ్బంది పెడుతున్నాడని, ఈనెల 3న బాలిక ఇంటికి వెళ్లి బాలికను ఇబ్బంది పెట్టగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చారన్నారు. దాంతో సదరు వ్యక్తి పారిపోయాడని ఫిర్యాదులో పేర్కొన్నారని సీఐ తెలిపారు.

దాడికి పాల్పడిన యువకుల అరెస్టు

విజయనగరం క్రైమ్, ఫిబ్రవరి05 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యక్తిపై దాడి చేసిన కేసులో నలుగురు యువకులను అరెస్ట్ చేసినట్టు వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. తోటపాలెం వైఎస్ఆర్ కాలనీలో ఉద్యోగ రీత్యా అద్దెకు ఉంటున్న పల్లి బాలకృష్ణ ఈనెల 2న ఇంటి బయట ఉన్న సమయంలో మద్యం మత్తులో యువకులు ఆయనతో గొడవపడ్డారు. అదే కాలనీకి చెందిన చెల్లూరి భార్గవనారాయణ, చెల్లూరి చంద్రశేఖర్, బొత్స మహేష్‌కుమార్, కంటు శివప్రసాద్.. బాలకృష్ణతో పాటు అతడి స్నేహితులపై దాడి చేసి గాయపరిచారు. అలాగే బాలకృష్ణ మోటర్ సైకిల్ లాక్కెళ్లారు. బాలకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసన్నకుమార్ కేసు నమోదు చేశారు. దాంతో బుధవారం ఆ నలుగురిని అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టామని సీఐ శ్రీనివాస్ తెలిపారు.

మద్యంతో వ్యక్తి అరెస్టు

వేపాడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆతవలో అనధికారికంగా నిర్వహిస్తున్న మద్యం దుకాణంపై వల్లంపూడి ఎస్ఐ బొడ్డుదేవి బుధవారం దాడి చేశారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. అతడి నుంచి 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. దాడిలో హెచ్‌సీ శేషాద్రినాయుడు ఉన్నారన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

భోగాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుందరపేట జాతీయ రహదారిపై బుధవారం గడ్డి ట్రాక్టర్‌ను కారు ఢీకొంది. ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు గడ్డి ట్రాక్టర్ పక్క నుంచి కారు వెళ్తోంది. అయితే గడ్డి ట్రాక్టర్ కారు వైపు రావడంతో కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు.

చౌకధరల దుకాణం తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భోగాపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ముక్కాంలోని చౌకధరల దుకాణాన్ని సీఎస్ డీటీ ఎంవీఎస్ఎన్ మూర్తి బుధవారం తనిఖీ చేశారు. 'తూనికల్లో అవకతవకలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన నేపథ్యంలో అధికారులు స్పందించారు. చౌకధరల దుకాణాన్ని తనిఖీ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల నిరసన

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ దానికి నిదర్శనమని బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు ఆరోపించారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట మంగళవారం ఉద్యోగుల నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ధనవంతులకు మాత్రమే ఉపశమనం కలిగిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడం తగదన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి అలుగు వెంకటరావు, ప్రతినిధులు లక్ష్మణ్‌కుమార్, కృష్ణకుమారి, రమణమ్మ, అక్కమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా పొరుగు జిల్లాలకే పరుగు

(ఐదో పేజీ తరువాయి)

● కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాల భవనాల నిర్మాణాలు ఇంకా కొలిక్కి రాలేదు. దీంతో తరగతులు ఇంకా ప్రారంభం కాలేదు.

● ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిర్వహించే శారీరక దారుఢ్య, పోటీ పరీక్షలకు జిల్లాలో కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. మూడేళ్లు గడుస్తున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో పార్వతీపురం, పాలకొండ, కురుపాం, సాలూరు నియోజకవర్గాలతో పాటు 15 మండలాలకు చెందిన నిరుద్యోగ యువత, సామాన్య, మధ్య తరగతి విద్యార్థులు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలకు పరుగులు పెట్టాల్సి వస్తోంది.

ఇబ్బందులు పడుతున్నాం..

మాలాంటి పేద, మధ్య తరగతి నిరుద్యోగులు సుదూర ప్రాంతాలకు వెళ్లి పోటీ పరీక్షలు రాయలేకపోతున్నారు. పోటీ పరీక్షలకు సంబంధించి ఇప్పటివరకు జిల్లా కేంద్రం పార్వతీపురంలో కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం విచారకరం. శిక్షణ కేంద్రాలను కూడా నిర్వహించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

- జి. చిరంజీవి, నిరుద్యోగి, పార్వతీపురం

కృషి చేయాలి

జిల్లాలో పేదలకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారింది. విజయనగరం, విశాఖపట్నం వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోలేపోతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఉన్నత విద్య కళాశాలల ఏర్పాటు కోసం స్థానిక ప్రజాప్రతినిధులతో అధికారులు కృషి చేయాలి.

-ఆర్.అదేష్, బీఎస్సీ విద్యార్థి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పార్వతీపురం

రహదారి పనులు వేగవంతం కావాలి

● **కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్**

సీతానగరం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడగల్లు నుంచి ముత్యాలదొరవలస గ్రామానికి నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఆయన నిడగల్లులో రూ.2 కోట్లుతో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులను, కుదించుకుపోతున్న నీలసాగరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజా సౌలభ్యం కోసం రోడ్డు పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. నీలసాగరాన్ని అభివృద్ధి చేసేందుకు ఉపాధి నిధులు మంజూరు చేసి, పనులు ప్రారంభించాలన్నారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీవో త్రివిక్రమరావు, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

శంబర మారువారం జాతర ఆదాయం రూ.5లక్షల 64వేలు

సాలూరు(మక్కువ), ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మక్కువ మండలంలోని శంబర పోలమాంబ అమ్మవారి మారువారం జాతర ఆదాయం 5లక్షల 64వేల 56 రూపాయలు వచ్చినట్టు ఆలయ ఈవో వీవీ సూర్యనారాయణ బుధవారం తెలిపారు. శీఘ్ర దర్శనం రూ.100 టికెట్ ద్వారా రూ.లక్షా 83 వేల 900, ప్రత్యేక దర్శనం రూ.20 టికెట్ ద్వారా రూ.74,500, కేశఖండన ద్వారా రూ.15,200, మహాన్నదానం విరాళాలు ద్వారా రూ.లక్షా 2,626, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.లక్షా 17వేల 990, పులిహోర ప్రసాదం ద్వారా రూ.69వేల 840.. మొత్తం రూ.5లక్షల 64వేల 56 వచ్చినట్టు ఆయన వెల్లడించారు. గత సంవత్సరం కంటే ప్రస్తుతం సంవత్సరం రథసప్తమి ఉత్సవాల కారణంగా భక్తుల సంఖ్య తగ్గడంతో ఆదాయం తగ్గిందని తెలిపారు.

నాణ్యతకు పాతరేస్తున్నారు: సీపీఎం

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మన్యం జిల్లా కేంద్రంలో హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార నాణ్యత విషయంలో సంబంధిత యజమానులు నాణ్యతకు పాతరేస్తున్నారని సీపీఎం నాయకులు వెంకటరమణ, సన్యాసిరావులు ఆరోపించారు. బుధవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మన్యం జిల్లా కేంద్రంలో విచ్చల విడిగా హోటళ్లు, రెస్టారెంట్లు వెలసాయని, అయితే నాణ్యమైన ఆహారం అందించడంలో యజమానులు దోపిడీ దోరణిని చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడు రోజులుగా సీపీఎం తరఫున బృందాలుగా పరిశీలించామని చెప్పారు. ఈ పరిశీలనలో ఆహారం కల్తీ అవుతున్నట్టు గుర్తించామని తెలిపారు. నాణ్యమైన భోజనాన్ని అందించకపోగా కలుషితమైన తాగునీటిని అందించడం చాలా దారుణమన్నారు.

నిబంధనల ప్రకారమే నియామకాలు

బలిజిపేట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నిబంధనల ప్రకారమే ఎండీఎం నిర్వాహకులను నియమించామని అరసాడ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వంగపండు జగదీశ్వరరావు, ప్రాథమికోన్నత పాఠశాల వైస్ చైర్మన్ కరణం లక్ష్మణరావు స్పష్టంచేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. తమ పాఠశాలల్లో ఎండీఎం నిర్వాహకులు, స్వీపర్, నైట్ వాచ్‌మన్‌లను కక్షపూరితంగా తొలగించి కొత్తవారిని నియమించామంటూ ఇటీవల ఒక దినపత్రికలో వచ్చిన వార్తలు అవాస్తవం అన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విద్యా కమిటీ పరిశీలించిన తర్వాత ఎండీఎం నిర్వాహకుల తీరు బాగోలేదని రుజువు కావడంతో వారిని తొలగించామని చెప్పారు. నిబంధనల ప్రకారం కొత్తవారిని నియమించామని తెలిపారు. డీఈవోకు దర్యాప్తు నివేదికను అందించామని చెప్పారు.

తైక్వాండో విజేతకు ఎస్పీ అభినందనలు



అరుణ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎస్పీ

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తైక్వాండో పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన ఏఆర్ కానిస్టేబుల్ కె.అరుణ్ కుమార్‌ను ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి బుధవారం తన చాంబర్‌లో అభినందించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత నెల 31వ తేదీ నుంచి ఈనెల 2వ తేదీ వరకు కాకినాడ జేఎన్‌టీయూ ఇండోర్ స్టేడియంలో ఎన్టీఆర్ స్మారక ఏపీ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన తైక్వాండో ఓపెన్ స్టేట్ మీట్‌లో అరుణ్‌కుమార్ పాల్గొని బంగారు పతకాన్ని కైవసం చేసుకోవడం సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఆర్ఐలు నాయుడు, రాంబాబు పాల్గొన్నారు.

మొరాయించిన మున్సిపల్ కమిషనర్ కారు



కమిషనర్ వాహనాన్ని నెడుతున్న సిబ్బంది

సాలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బుధవారం మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ వాహనం కదలక మొరాయించింది. దీంతో మున్సిపల్ సిబ్బంది నెట్టుతూ ఆ వాహనం స్టార్ట్ అయ్యేంత వరకు నానా పాట్లు పడ్డారు. మున్సిపాల్టీకి సేవలు అందించే కమిషనర్ వాహనం ఇలా మొరాయించటంతో అక్కడకు వచ్చిన వారు నవ్వుకున్నారు.

జగదీష్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న విజయనగరం ఎమ్మెల్యే అదితి

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ ద్వారపు రెడ్డి జగదీష్ కుటుంబాన్ని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు బుధవారం పరామర్శించారు. జగదీష్ తల్లి సావిత్రమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే. జగదీష్ కుటుంబాన్ని పరామర్శించారు. పార్వతీపురం మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు, టీడీపీ నాయకులు ఉన్నారు.

మురుగులోనే రాకపోకలు

● **ఇబ్బంది పడుతున్న ముంజేరు గ్రామస్థులు**

● **ఏళ్ల తరబడి సమస్య ఉన్నా పట్టించుకోని అధికారులు**



ముంజేరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

భోగాపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నిత్యం మురుగు నీటిలోనే రాకపోకలు.. ఏళ్ల తరబడి సమస్య ఉన్నా పరిష్కారం కాని వైనం.. ఇదీ ముంజేరు గ్రామం పరిస్థితి. గ్రామంలో కాలువలు ఉన్నా మురుగు మాత్రం ప్రధాన రహదారిపైనే ప్రవహిస్తోంది. సుమారు రెండు సంవత్సరాల నుంచి ఈ సమస్య వెంటాడుతోంది. కాలువలు ఉన్నా మురుగు మాత్రం వాటి ద్వారా ప్రవహించే అవకాశం లేదు. దీంతో మురుగు నీరు రహదారిపై నుంచే ప్రవహిస్తోంది. ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి గుండా ఎమ్మెల్యే తోపాటు అధికారులు నిరంతరం రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు కాలువల్లో ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● దీనిపై ఎంపీడీవో గాయత్రీని వివరణ కోరగా అక్కడ ప్రజలతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాం. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

● **ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల**



మాట్లాడుతున్న మంజుల

రామభద్రపురం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో అందరూ ఐక్యంగా పోరాడాల్సిన ఆవశ్యకత ఉందని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల కోరారు. బుధవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సభ్యత్వాలు కట్టడమే బాధ్యత కాకుండా ఆందోళనలో ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఏపీటీఎఫ్ జిల్లా సహాయ అధ్యక్షుడు జేసీ రాజు, ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు బంకురు జోగినాయుడు, బొబ్బిలి మండల శాఖ అధ్యక్షుడు సీహెచ్ ప్రవీణ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం కర్రి కామేశ్వరరావు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి తీసుకువెళ్లాం

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఇప్పటికే విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకు వెళ్లామని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల తెలిపారు. బుధవారం రామభద్రపురం మండల కేంద్రానికి విచ్చేసిన ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడారు. యాప్‌ల కారణంగా ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించ లేకపోతున్నారన్నారు. 117జీవోలో తెలుగు, ఇంగ్లీషు రెండు మాధ్యమాలు ఉండాలని తెలిపారు. 45 మంది విద్యార్థుల సంఖ్య దాటితే రెండు సెక్షన్లు ఉండాలని కోరారు. ● సరండర్ లీవులు క్రెడిట్ కాలేదని, ఇంత చిన్న విషయానికి కూడా ఉద్యమాలు చేయాలా.. అని ఉపాధ్యాయులు ఆమెను ప్రశ్నించారు. గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వంలో కూడా ఉపాధ్యాయుల పెన్షన్ల సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు తప్ప ఇతర అలవెన్సులు అందడం లేదని ఆమె దృష్టికి తీసుకువెళ్లారు.

ఎమ్మెల్యేని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు



బేబీనాయనతో చర్చిస్తున్న రాజేష్‌వర్మ

బొబ్బిలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉప్పలపాటి రాజేష్ వర్మ బుధవారం స్థానిక ఎమ్మెల్యే బేబీనాయనను బొబ్బిలిలో ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. వర్మకు బేబీనాయన బొబ్బిలి వీణను బహూకరించి శాలువతో సత్కరించారు. ఆయన వెంట బొబ్బిలి బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మరిశర్ల రామారావు నాయుడు ఉన్నారు.

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గానికి ఎన్నిక పత్రాన్ని అందిస్తున్న ఎంపీడీవో రవికుమార్

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శుల మండల కార్యవర్గాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎన్నుకున్నారు. మండల విస్తరణ అధికారి అల్లు భాస్కరరావు నేతృత్వంలో జరిగిన ఈ ఎన్నికల్లో సంఘం గౌరవాధ్యక్షుడిగా పక్కి మధుసూధనరావు, అధ్యక్షుడిగా టి.రాఘవేంద్రరావు, ఉపాధ్యక్షులుగా బీఎస్ కృష్ణమ్మ, జి.సింహాచలం, ప్రధాన కార్యదర్శిగా జి.నారాయణరావు, కోశాధికారిగా ఎన్‌వీ రవీంద్రకుమార్, సహాయ కార్యదర్శి/కోశాధికారిగా టి.పార్వతమ్మ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులను ఈవోపీ ఆర్డీతో పాటు పలువురు సంఘ సభ్యులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పి.రవికుమార్, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



పార్వతీపురం టౌన్: నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులపై దాడి చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్ చట్టాలను తీసుకొచ్చిందని సీఐటీయూ జిల్లా నాయకుడు ఎస్.గోపాలం అన్నారు. లేబర్ కోడ్ చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఎం.బూర్జవలస గ్రామంలో బుధవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నూతన కోడ్ చట్టాలను రద్దు చేసి, పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు. ● పార్వతీపురంటౌన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పట్టణంలోని మున్సిపల్, నాలుగు రోడ్ల కూడలి వద్ద సీఐటీయూ, ఇఫ్టూ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిరసన చేపట్టారు. సంఘాల నాయకులు మన్మథ రావు, జీవీ రమణ, ఆర్.వేణు, సర్వేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు. ● పాలకొండ: కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కొత్తగా తీసుకొస్తున్న లేబర్ కోడ్‌లను ఉపసం హరించుకోవాలని సీఐటీ యూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు కోరారు. ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాల రాస్తోందన్నారు. సీఐటీయూ మండల కార్యదర్శి కాద రాము, రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు గేదెల సత్యం, కార్యదర్శి ఎడ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్థలం కేటాయింపుపై మాట్లాడండి



మాట్లాడుతున్న ఏపీ టూరిజం బోర్డు డైరెక్టర్ సుధారాజు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోట పాత బస్టాండ్ వద్ద అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు స్థలం కేటాయింపుపై సర్పంచ్ గనివాడ సంతోషికుమారి, వార్డుసభ్యులతో మాట్లాడాలని ఎంపీపీ సోమేశ్వరరావుకు టూరిజం డెవలప్‌మెంట్ బోర్డు డైరెక్టర్ ఇందుకూరి సుధారాజు సూచించారు. బుధవా రం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎంపీపీ తో ఆమె మాట్లాడారు. అన్నా క్యాంటీన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, జడ్పీ సీఈవో సత్యనారాయణ ఇటీవల స్థల పరిశీలన చేశారన్నారు. ఆ స్థలం ఎక్కడ అనేది చర్చించి తీర్మానం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీ సీ సభ్యులు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, వార్డు సభ్యులు అడారి సూరిబాబు, భారతి తదితరులున్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి



మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పీఎం జన్‌మన్ పథకం కింద గిరిజన ప్రాంతాల్లో మంజూరైన గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు జరుగుతున్న గృహాలకు జియో ట్యాగింగ్ చేసి బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

విద్యార్థులపై దృష్టి సారించాలి

పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని చదువులో వెనుకబడి ఉన్న డి, ఇ గ్రేడ్‌ల విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డి, ఇ గ్రేడ్‌లలో ఉన్న విద్యార్థులను సి గ్రేడ్‌కు తీసుకువచ్చేందుకు హెచ్‌ఎంలు ప్రత్యేక తర్ఫీదు ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీవో జి.చిన్నబాబు, డీడీ అన్నదొర, డిప్యూటీ ఈవో కేఆర్‌పీ కుమార్, ఏటీడబ్ల్యువో మంగవేణి, జీసీడీవో రాములమ్మ, సీఎంవో కోటిబాబు, సీనియర్ హెచ్‌ఎంలు నారాయుడు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నిలిచిన గూడ్స్

● **స్తంభించిన ట్రాఫిక్**



బెలగాం గేటు వద్ద నిలిచిపోయిన గూడ్స్

బెలగాం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బెలగాం రైల్వేగేటు వద్ద బుధవారం ఉదయం గూడ్స్ సుమారు 40 నిమిషాలు నిలిచిపోయింది. ఇంజన్ మరమ్మతులకు గురి కావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల ట్రాఫిక్ స్తంభించింది.

రహదారి మరమ్మతులు ప్రారంభం

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యో తి): స్థానిక బైపాస్, పాతబస్టాండ్ నుంచి రాయగడ రోడ్డు శివారు వరకు గల అంతరాష్ట్ర రహదారి మరమ్మతులు బుధవారం ప్రా రంభమయ్యాయి. ఈ రహదారి పరిస్థితిపై ఆంధ్రజ్యోతిలో పలు సార్లు కథనాలు వెలువడ్డాయి. దీంతో ఆర్అండ్‌బీ అధికారులు స్పం దించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈనేపథ్యంలో ప్రత్యేక నిధులు రావడంతో రహదారుల మరమ్మతులకు రూ.17లక్షలు కేటాయించారని ఆర్అండ్‌బీ ఏఈఈ రాజేంద్రకుమార్ తెలిపారు.

ఘనంగా ఘటాల ఊరేగింపు



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

సాలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్యామలాంబ అమ్మవారి పండుగను పురస్కరించుకుని పట్టణంలో బుధవారం ఘటాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి గద్దె నుంచి గ్రామ పుర వీధుల్లో ఊరేగింపుగా వెళ్లిన మహిళలు తిరిగి అమ్మవారి గద్దెకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అక్యాన అప్పారావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ధిక్కరిస్తే చర్యలు తప్పవు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ నిబంధనలు ధిక్కరిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.పైడితల్లి హెచ్చరించారు. మండలంలోని కొంకడివరం, సీతారామపురం, ఉల్లిభద్ర పంచాయతీల పరిధిలో ఉపాధి పనులను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పనులకు హాజరు కాని వారి పేర్లు నమోదు చేస్తే చర్యలు తప్పవన్నారు. అవకతవకలకు పాల్పడితే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. ఈ పరిశీలనలో ఏపీవో ఎం.గౌరీనాథ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనిచేయాలి

వీరఘట్టం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రేగులపాడు గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో బి.వెంకటరమణ బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా మస్తర్లను తనిఖీ చేశారు. గరిష్ట వేతనం రూ.300 పొందడానికి నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేయాలని వేతనదారులకు సూచించారు. అనతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు.

పూర్తి స్థాయిలో వేతనం పొందాలి

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తురకనాయుడువలస, ఇటిక గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో శంబంగి రమేష్ బుధవారం పరిశీలించారు. కూలీలకు పూర్తిస్థాయిలో వేతనం రావాలంటే ఏ విధంగా పనిచేయాలన్నది వివరించారు. అనంతరం బీజే పురంలో ఆధార్ సెంటర్ పనితీరును పరిశీలించారు. అనంతరం జియ్యమ్మవలసలో పీఎం సూర్యఘర్ పథకంలో 89 పేర్లు మంజూరవ్వగా అందులో 16 మంది లబ్ధిదారులను నేరుగా కలిశారు. సోలార్ వినియోగంపై అవగాహన కల్పించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరిగేటట్లు చేశారు. ఈయన వెంట జూనియర్ అసిస్టెంట్ సత్యప్రసాద్ ఉన్నారు.

న్యూస్ బాక్స్

పిటిషన్ కొట్టివేత

పార్వతీపురం/పాలకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ ఎం.స్వర్ణకుమారి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు బుధవారం కొట్టివేసింది. నగర పంచాయతీ పరిధిలోని 19వ వార్డుకు ఉప ఎన్నిక నిర్వహిస్తే తాను గెలుస్తానని భావించి ఆమె పిటిషన్ వేశారు. అయితే వాజ్యం దాఖలు చేసే అర్హత పిటిషనర్‌కు లేదని చెబుతూ హైకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుజాత తీర్పు ఇచ్చారు.

ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి తోయక పరమేష్ జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యాడని హెచ్‌ఎం నాగరాజు బుధవారం స్థానిక విలేకర్లకు తెలిపారు. నంద్యాలలో ఇటీవల జరిగిన రాష్ట్ర పోటీల్లో పరమేష్ పాల్గొని, వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించాడని పీడీ మాధవరావు తెలిపారు. ఫిబ్రవరి 10 నుంచి 14వ తేదీ వరకు పాట్నాలో జరగబోవు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని ఆయన చెప్పారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

గరుగుబిల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో జి.పైడితల్లి, ఈవోపీఆర్డీ ఎల్.గోపాలరావు సూచించారు. మండల కేంద్రంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. రహదారులకు ఆనుకుని బ్యానర్లను ఏర్పాటు చేశారు. కార్యాలయాల ముందు హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేశారు. సర్పంచ్ కె.ఇందుమతి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంపు

పార్వతీపురంటౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాతో పాటు విజయనగరం జిల్లాకు సంబంధించి గీత కులాలకు 50 శాతం లైసెన్స్ ఫీజు రాయితీతో కేటాయించించిన మద్యం దుకాణాల కోసం దరఖాస్తుల స్వీకరణకు ఈనెల 8వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు మన్యం జిల్లా ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాథుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాటరీ నిర్వహించే తేదీని కూడా 10వ తేదీకి మార్చామని చెప్పారు. ఈ అవకాశాన్ని గీత కులాల వారు వినియోగించుకోవాలన్నారు.

మహిళలకు రక్షణగా వన్ స్టాప్ కేంద్రాలు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న మహిళలకు రక్షణగా వన్ స్టాప్ కేంద్రాలు అండగా ఉంటాయని కేంద్ర పరిపాలన అధికారిణి గంగవంశం శాంతకుమారి అన్నారు. గరుగుబిల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను ఆమె బుధవారం సందర్శించారు. మహిళా చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్ఎల్ పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

నేల కూలిన భారీ వృక్షం

గరుగుబిల్లి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): లఖనాపురం శివారులో ఉన్న 150 ఏళ్ల నాటి పెద్ద చింత చెట్టు బుధవారం నేలకూలింది. పరిసర ప్రాంతాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పంట పొలాల్లో నేలకొరిగిన చెట్టును తొలగించేందుకు రైతులు అవసరమైన చర్యలు చేపడుతున్నారు.



నేలకూలిన చింత చెట్టు